ఈకాలం
THE HONEST TELUGU DAILY





# "టోలీ" పెట్టు.. బండి పట్టు!!

unloading problem solved

**కలెక్టర్ సూచన మేరకు పీఏసీఎస్ లకు రవాణా అధికారుల అల్టిమేటం..**

**- దెబ్బకు దిగొచ్చిన బిహారీలేబర్లు**


**- జిల్లాలో.. చకచక జొన్నల కొనుగోళ్లు**

**- మార్క్ఫెడ్ కొత్త గోదాములు చూయిస్తే సమస్య పూర్తిపరిష్కారం**



టోలి.. అంటే బిహారి లేబర్ ల బృందం. జొన్నల కొనుగోళ్లలో ఇన్నిరోజులు అన్లోడింగ్ సమస్యకు కారణమైన వీరిలోటును రవాణాశాఖ అధికారులు తీర్చివేశారు. పీఏసీఎస్, జిసిసి లలో వృధాగా ఉన్న బిహారి లేబర్ లను అన్లోడింగ్ పాయింట్లకు పంపిస్తేనే ఆయా సెంటర్లకు బండ్లు పంపించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు చేశారు. రవాణాశాఖ అధికారులు దాన్ని తూచాగా పాటించడంతో ప్రస్తుతం జిల్లాల్లో జొన్నల కొనుగోళ్ల వ్యవహారం దాదాపుగా ఆటంక రహితంగా కొనసాగుతోంది.

**- Devender Nukala**




## 100 లేబర్ ల నుండి రోజుకు 330 పెంపు..

మే 12వ తేదీ నుండి సిఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు రవాణా శాఖ కొనుగోలు ప్రక్రియలో భాగమైంది. అప్పుడు గోదాముల్లో 100 మంది బీహారీ లేబర్లు ఉండగా, సెంటర్లలో 700 మంది ఉండడాన్ని గమనించారు. అన్లోడింగ్ చోట తక్కువ లేబర్లు, లోడింగ్ చోట ఎక్కువమంది ఉండడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సమక్షంలో పక్కా ప్లాన్ చేసి లేబర్ లను గ్రూప్ఏలో 233 మంది, బిలో 233, సిలో 233 లేబర్లను విభజించి రొటేషన్ పద్ధతిలో పనిచేయించారు. ఆర్టిఏ అధికారులు లేబర్ కాంట్రాక్టర్ గా వ్యవహరించి ముకథంలు, కాంట్రాక్టర్లతో పదేపదే సమావేశాలు ఏర్పాటు చేశారు. తాజాగా రొటేషన్ పద్ధతిలో అటు కొనుగోలు కేంద్రాల్లో, ఇటు గోదాముల్లో సరిపడా లేబర్లు ఉండడంతో ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. కలెక్టర్ రాజర్షి షా సూచనల మేరకు డిటిఓ శ్రీనివాస్, ఏఎంవిఐ హరి, కొత్త రిక్రూట్ ఏఎంవిఐలు, హోంగార్డులతో సహా 18 మంది ఆర్టిఏ స్టాఫ్ అహర్నిశలు పనిచేసి జొన్నల కొనుగోళ్ల వ్యవహారాన్ని దారికి తీసుకువచ్చారు. మార్క్ఫెడ్ అధికారులు కొత్త గోదాములను ఏర్పాటు చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది.



## భగీరథ్‌కు ముగిసిన పోలీస్ కస్టడీ చర్లపల్లి జైలుకు తరలింపు



ఈకాలం

బాలికపై లైంగిక దాడి కేసులో అరెస్టయిన బండి సాయి భగీరథ్ మూడు రోజుల కస్టడీ శుక్రవారంతో ముగిసింది. దీంతో నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పలు వివరాలను పోలీసులు నిందితుడి నుంచి రాబట్టినట్టు తెలిసింది.బాధితురాలితో పరిచయం అయిన నేపథ్యం, వారి మధ్య ఏర్పడిన సంబంధాలపై ఆరా తీసినట్లు సమాచారం. ప్రధానంగా డిసెంబర్ 31వ తేదీన జరిగిన ఘటనపై లోతైన విచారణ జరిపినట్లు తెలిసింది. అలాగే బాధితురాలితో వివిధ అపార్ట్‌మెంట్లలో కలిసిన విషయాలు, లైంగిక దాడి జరిగిన ఘటనపై కూపీలాగినట్లు సమాచారం.అయితే చాలా ప్రశ్నలకు నిందితుడు సమాధానం చెప్పకుండా మౌనంగానే ఉన్నట్లు పోలీసులు చర్చించుకున్నారు. మరోవైపు నిందితుడు సాక్ష్యాలు మాయం చేయడంపై దృష్టి పెట్టిన పోలీసులు.. కొన్ని సోషల్ మీడియా అకౌంట్లకు సంబంధించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్లను కూడా తీసుకున్నట్లు తెలిసింది. వీటిన్నింటితోపాటు నిందితుడు కేసు నుంచి తప్పించుకోవడానికి సహకరించిన వారి సమాచారాన్ని కూడా పోలీసులు రాబట్టినట్లు సమాచారం.ఈ సమాచారంతో మున్ముందు న్యాయ సలహాలు తీసుకొని, కేసుతో సంబంధమున్న వారిని విచారణ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే దర్యాప్తు అధికారులకు పైనుంచి వస్తున్న ఒత్తిళ్లతో కేసు దర్యాప్తు సమగ్రంగా ముందుకు సాగుతుందా..? అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

## వేములవాడలో 12వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె.. మద్దతుగా నిలిచిన ప్రజా గొంతుక విమలక్క!

వీఓఏల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవి.. ఉద్యోగ భద్రత కల్పించాల్సిందే: విమలక్క







ఈకాలం

తెలంగాణ ఐకేపీ, వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సెర్ప్ ఆధ్వర్యంలో వేములవాడ మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసన దీక్షలో కూర్చున్న వీఓఏలకు అరుణోదయ సాంస్కృతిక సారథి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రజా గొంతుక విమలక్క విచ్చేసి తన పూర్తి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలనే వారి డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్నారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటు 58 జీఓను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించేంత వరకు, వారి సమస్యలు తీరేంత వరకు తమ పోరాటం ఆపొద్దని, తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొని నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ నిరవధిక సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి

- మరోసారి తేల్చిచెప్పిన సుప్రీం కోర్టు

ఈకాలం

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు 'టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)' పాస్ కావడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. సర్వీసులో కొనసాగడానికి.. ఈ పరీక్షలో ఉత్తీర్ణత గడువును 2027 ఆగస్టు 31 నుంచి 2028 ఆగస్టు 31కి పొడిగించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు ఇచ్చింది. అంజుమన్ ఇషాత్ ఏ తాలీమ్ ట్రస్ట్ కేసులో కోర్టు ఇచ్చిన 2025 నాటి తీర్పును సవాల్ చేస్తూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తిగతంగా కొందరు టీచర్లు దాఖలు చేసిన 65కు పైగా రివ్యూ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది.పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి అర్హులైన ఉపాధ్యాయులు అవసరమని తేల్చిచెప్పింది. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులై.. పదవీ విరమణకు ఐదేళ్ల కంటే ఎక్కువ సమయం ఉన్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా 2025 సెప్టెంబరు 1 నుంచి రెండేళ్లలోగా టెట్ పరీక్ష పాస్ కావాలని 2025లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఐదేళ్లలోపు రిటైరయ్యే ఉపాధ్యాయులకు ఈ పరీక్ష పాస్ కావడం నుంచి మినహాయింపునిచ్చినప్పటికీ..ఆలోగా వారికి ఎలాంటి ప్రమోషన్లూ ఉండవని సుప్రీం స్పష్టం చేసింది.అయితే, విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమితులైనవారికి దీన్నుంచి మినహాయింపునివ్వాలని పిటిషనర్లు అభ్యర్థించారు. వారు కూడా టెట్ పాసవ్వాలని నిర్దేశించడమంటే.. చట్టాన్ని పాత తేదీ నుంచీ వర్తింపజేయడమేనని వాదించారు. వారి వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది.ఇన్‌సర?్వస టీచర్లు కూడా నిర్ణీత కాలపరిమితిలోగా కనీస అర్హతలను సాధించాలని విద్యాహక్కు చట్టం నిబంధనలు నిర్దేశిస్తున్నాయని.. వారు ఆ అర్హతలను సాధించడానికి సమయం కూడా ఇచ్చిందని గుర్తుచేసింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ జారీ చేసిన సబార్డినేట్ లెజిస్లేషన్ లేదా నోటిఫికేషన్లలోని మినహాయింపులు మూలచట్టాన్ని అధిగమించలేవని చెప్పింది. టెట్ అనేది..ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను, బాలలకు బోధించడంపై వారికి ఉన్న అవగాహనను, ఉపాధ్యాయులుగా వారికి ఉండాల్సిన అభిరుచి/సామర్థ్యం ఉన్నాయో లేవో అంచనా వేసే అర్హత పరీక్ష అని గుర్తుచేసింది. టెట్‌ను తప్పనిసరి చేయడం వల్ల వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారనే వాదన ఆధారంగా గత




తీర్పును అమలు కాకుండా చేస్తే.. అర్హతలేని ఉపాధ్యాయులను సర్వీసులో కొనసాగించడమే అవుతుందని.. ఇది రాబోయే తరాల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఆందోళన వెలిబుచ్చింది.పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టి ఉపాధ్యాయుల సర్వీసును కొనసాగించలేమని చెప్పింది. సర్వీసులో ఉపాధ్యాయులంతా ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణులవ్వాల్సిందేనని తేల్చిచెబుతూ.. టెట్ ఉత్తీర్ణత గడువును మాత్రం తాజాగా మరో ఏడాదిపాటు పొడిగించింది. ఇకపై కాలపరిమితిని పొడిగించబోమని స్పష్టం చేసింది. టెట్‌ను 6నెలలకొకసారి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

## నిఘా నీడలో ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు.

- 101 సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు మరింత భరోసా.
- నేరాల నియంత్రణలో,కేసుల చేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- ఒక సీసీ కెమెరాల 100 మంది పోలీసులతో సమానం.
- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు స్వచ్చందగా ముందుకు రావాలి.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

ఈకాలం

శనివారం రోజున ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 101 సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమనికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.

నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఒక్క సీసీ కెమెరా100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు.ఆధునిక సాంకేతిక





పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన నిందితులను త్వరితగతిన గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ ముందంజలో సాగుతోందని తెలిపారు.సీసీ కెమెరాలు, డిజిటల్ నిఘా వ్యవస్థలు ఆధునిక దర్యాప్తు పద్ధతుల ద్వారా నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా రుగుతోందన్నారు.ప్రజలు,వ్యాపారస్థులు,ప్రజాప్ర తినిధులు స్వచ్చందగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని,తద్వారా పట్టణాల్లో ,గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం,నేరాలకు పాల్పడిన వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయన్నారు.ముస్తాబద్ మండలం తో పాటుగా గ్రామాల్లో స్వచ్చందగా ముందుకు వచ్చి 101 సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ధాతలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ గణేష్ , ప్రజాప్రతినిధులు , సన్ రైస్ సీసీ కెమెరాల కంపెనీ సభ్యులు , పోలీస్ సిబ్బంది ఉన్నారు

## అప్పుల బాధతో ఏఈఓ ఆత్మహత్య

ఈకాలం

'మీ ఫోన్ వస్తే భయమేస్తోంది సార్.. మీ వల్ల నరకం చూశాను.. అధిక వడ్డీకి అప్పులు తీసుకొని తీర్చలేకపోతున్నా.. నా కుటుంబ సభ్యులు నన్ను క్షమించాలి'అని సూసైడ్ నోట్ రాసి వ్యవసాయాధికారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే...చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుంటోజు బాలరాజు (38) కొన్నేళ్లుగా కేతేపల్లి క్లస్టర్ వ్యవసాయ శాఖలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుటుంబ అవసరాలతోపాటు వ్యవసాయం చేసేందుకుగాను కొందరి వద్ద అప్పుగా డబ్బు తీసుకొని వాటిపై అధిక వడ్డీ భారం మోస్తూ మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు.బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించగా గురువారం ఉరుమడ్లలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### అప్పుల మీద అప్పులు..

ఆత్మహత్యకు ముందు ఏఈఓ బాలరాజు తొమ్మిది పేజీల సూసైడ్ నోట్ రాశాడు. అందులో.. అప్పు ఇచ్చిన వారు ఫోన్ చేస్తూ ఒత్తిడి చేశారని పేర్కొన్నాడు. తాను పనిచేస్తున్న ప్రాంతంలో మరో వ్యక్తితో కలిసి పదెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేయగా రూ.3 లక్షల నష్టం వచ్చిందన్నాడు. అది పూడ్చుకునేందుకుగాను ఓ చిట్‌ఫండ్‌లో పనిచేసే ఏజెంట్ ద్వారా తన తోటి కౌలుదారుతో చిట్టీ వేయించానని, అందుకు తాను ష్యూరిటీ ఉన్నానని, అతడు చిట్టీ డబ్బులు పూర్తిగా కట్టకపోవడంతో రూ.5 లక్షలు చిట్‌ఫండ్ కంపెనీకి తానే కట్టాల్సి వచ్చిందని నోట్‌లో




పేర్కొన్నాడు. ఈ భారం నుంచి బయటపడేందుకు.. తెలిసిన వ్యక్తుల ద్వారా మార?టగేజ్ లోన్లు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తీసుకొని, వడ్డీలు కట్టలేక మరలా అప్పులు చేయాల్సి వచ్చిందని బాలరాజు వివరించాడు. అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను మోసం చేస్తున్న వారిని వదిలిపెట్టొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌లో కలెక్టర్, ఎస్పీలను కోరాడు.

